క్లుప్తంగా

బాలవికాస్ కేంద్రం ప్రారంభం



బాలవికాస్ కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సమితి పెద్దమందిరం ఆధ్వర్యంలో నానుబాలవారి వీధిలో నూతనంగా బాలవికాస్ కేంద్రాన్ని అరుణ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు మాట్లాడుతూ... చిన్నారులలో నైతిక విలువలు పెంపొందించేందుకు, వారిలోని సృజనను వెలికి తీసేందుకు బాలవికాస్ కేంద్రాలు తోడ్పడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి ఆదివారం నిర్వహించే బాలవికాస్ తరగతులకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు అధ్యక్షులు గంగుల రమణబాబు, సేవాదళ్ కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు, కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా బాలవికాస్ కోఆర్డినేటర్ శశికాంత్, బాలవికాస్ కోఆర్డినేటర్లు, పెద్దమందిరం కన్వీనర్ మురళి ఉన్నారు.

చిన్నారులపై జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీతామహలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులను ఎండలో బయటకు పంపవద్దని, ఎండలు పెరుగుతున్న దృష్ట్యా అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణాపార్కు సెక్టారు సూపర్‌వైజర్ పి.సీతామహలక్ష్మి అన్నారు. జబ్బావీధి 1, 2 కేంద్రాలు, చేపలవీధి కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులకు ఎండల తీవ్రతపై సోమవారం అవగాహన కల్పించారు. ఎండలో తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. కేంద్రాల్లో మంచినీరు ఉంచుకోవాలని, వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఓ.ఆర్.ఎస్.ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యకర్తలు సంధ్యారాణి, కళ, లత, శశికళ, విజయలక్ష్మి, ఎం.ఎస్.కె.రత్నకుమారి, ఆశావర్కర్ పావని పాల్గొన్నారు.

రంగనాథస్వామికి పూజలు



దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేకపూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో గోదా సమేత రంగనాథస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ మహోత్సం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 4వ తేదీ వరకు పూజలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిచారు. దేవాలయ సేవా ట్రస్ట్ ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి ఉత్సవాలకు వితరణ



కమిటీ సభ్యులకు డబ్బులను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో వేంచేసిన గ్రామదేవత ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద నిర్వహించే ఉత్సవాలకు 36,301 రూపాయలను వితరణగా అందజేశారు. పిండి శారద, నాగేశ్వరరావు దంపతులు ఈ మొత్తాన్ని ఉత్సవ నిర్వాహకులు గజపతి ద్వారా అందించారు. మే 20 నుంచి 28వ తేదీ వరకు ముత్యాలమ్మతల్లి ఉత్సవాలు జరుగుతాయి.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం జంక్షన్ వద్ద గ్రామానికి చెందిన హమావతి, సత్యారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణీకులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేపట్టారు.

నవోదయకు ఎంపిక

జి.సిగడాం: మండలంలోని బాతువ శ్రీరామ మోడల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు వెన్నెలవలస నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యారు. అనుపోజు గౌతమ్ సాయి, బూర్లి హరిణి, వి.దివ్యసాయి రాజ్‌ను పాఠశాల కరస్పాండెంట్ ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ బూటు లక్ష్మణరావు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సీఎం జగన్ పాలన అపూర్వం

- చంద్రబాబు ఎజెండా దోచుకోవడం.. జగన్ ఎజెండా ప్రజలకు మంచి చేయడం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన అపూర్వమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుకుళం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిరోజైన సోమవారం బలగ, ఆదివారంపేటలో ప్రచార సభలు నిర్వహించారు. తొలుత అరసవల్లి దేవాలయంలో పూజలు చేసి.. అక్కడ స్థానిక నాయకత్వంతో కలిసి ప్రచారం సాగించారు. బలగలో సభలో ధర్మాన మాట్లాడుతూ.. ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్నామని బాణాలు సంధించాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. మన గుర్తు ఫ్యాన్..అని నినాదాలు చేయించారు. ప్రచారం ఇక్కడి నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారంపేట ప్రజలు ఎప్పుడూ అత్యధిక మెజారిటీ ఇస్తూనే ఉన్నారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ ప్రజల మధ్యనే ఉన్నామన్నారు. రాష్ట్రంలో దొంగ మీడియా ఉందని.. వారు ప్రతీదాన్ని వక్రీకరించి వార్తలు వేయడమే వారి పనన్నారు. 14 ఏళ్ల పాటు దోపిడీ పాలన సాగించిన పార్టీ ఒకవైపు.. ఐదేళ్లు సుపరిపాలన చేసిన పార్టీ ఇంకొక వైపు ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మార్పులు గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 14 ఏళ్ల పాటు పాలించిన చంద్రబాబు జిల్లాకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో రిమ్స్ మెడికల్ కాలేజీ, అంబేడ్కర్ యూనివర్సిటీ, వంశధార ప్రాజెక్టును తెచ్చామని గుర్తు చేశారు. ఆయన తనయుడు జగన్ మరో అడుగు ముందుకేసి మూలపేట పోర్టు, రూ. 700 కోట్లతో ఉద్దానం వాటర్ స్కీమ్, బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించారన్నారు. అభివృద్ధి అంతా తానే చేశానని చంద్రబాబు చెప్పుకుంటే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఎల్లో మీడియాకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం చేరువ

చంద్రబాబు పాలనలో పేద ప్రజలంతా విద్య, వైద్యానికి దూరమయ్యారని ధర్మాన అన్నారు. వారి అవసరాలు తీర్చడమే అసలైన పాలన అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 31 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి ఊళ్లకు ఊర్లే నిర్మించామన్నారు. ప్రభుత్వ పథకాలు సగౌరవంగా అందుకునేలా చేశామన్నారు.

ఇందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సమన్వయంతో అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించామన్నారు.



హాజరైన మహిళలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు

అధిక మెజారిటీ ఖాయం..

మన ఊరి స్థితిగతులు, మనందరి స్థితిగతులు పెంచిన ప్రభుత్వం ఇది. జీవన ప్రమాణాలు పెంచిన ప్రభుత్వానికి తోడుగా ఉండాలని ప్రజలు అందరు ఎప్పుడో నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ మెజారిటీ రావడం ఖాయమన్నారు. దీనికి గత ఐదేళ్లలో ఏ తప్పూ చేయకపోవడంతోపాటు జగన్ అందించిన సుపరిపాలనే కారణమన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ధర్మాన పిలుపునిచ్చారు.

అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ధర్మాన

అభివృద్ధే మంత్రి ధర్మాన తారకమంత్రమని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. మీ అందరి ఆదరాభిమానంతో ఒక్క అవకాశాన్ని ఇచ్చి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, 50వ డివిజన్ ఇన్‌చార్జి పంకు ప్రసాద్, సాధు వైకుంఠరావు, బలగ గణపతి పట్నాయక్, కింజరాపు రామారావు, యాళ్ల జానకీరావు, వరుదు విజయ్‌కుమార్, మెరక సూర్యనారాయణ, నల్లబారికి శ్రీను, మంగు వేదవల్లి, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎం.వి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు ఎం.వి స్వరూప్, శిమ్మ రాజశేఖర్, ఎం.ఎ.రఫీ, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్ పాల్గొన్నారు.

స్వామీ..విజయాశీస్సులివ్వు..



మంత్రి ధర్మానకు స్వాగతం పలుకుతున్న పాలకమండలి సభ్యులు రవి తదితరులు

అరసవల్లి: మరోసారి రాష్ట్ర ప్రజలకు జగనన్న పాలన లభించేలా.. అలాగే తనకూ మరోసారి విజయం వరించేలా ఆశీస్సులివ్వాలంటూ ప్రత్యక్ష దైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారిని మంత్రి ధర్మాన ప్రసాదరావు మొక్కుకున్నారు. సోమవారం ఉదయం శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మంత్రి ధర్మాన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే క్రమంలో ముందుగా అరసవల్లి ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఎన్నికల ముందు ఇలాగే ఆదిత్యున్ని దర్శించుకున్న తర్వాతే ప్రచారాలను ప్రారంభించడం ధర్మానకు సెంటిమెంట్‌గా వస్తోంది. ఇదిలావుంటే ధర్మాన వెంట శ్రీకాకుళం కార్పొరేషన్, గార, శ్రీకాకుళం మండలాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, ద్వారపు అజిత్ తదితరులు మంత్రి ధర్మానకు ఘనంగా స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. వీరి వెంట పార్టీ స్థానిక డివిజన్ ఇన్‌చార్జిలు గంగు సీతాపతి, తెలుగు రమేష్, పార్టీ ముఖ్య నేతలు ఎం.వి.పద్మావతి, గొండు క్రిష్ణ, బరాటం నాగేశ్వరావు, కామేశ్వరి తదితరులున్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సంచాం, తిరుపతిపాలెం, నెలివాడ, పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ఇంటింటికీ వలంటీర్లు వచ్చి పింఛన్లు ఇచ్చేవారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తారని, అవ్వాతాతలు పింఛన్ కోసం మండుటెండల్లో పడిగాపులు కాసే రోజులు మరలా వస్తాయన్నారు. ప్రజలకు ఏ సంక్షేమ పథకం కావాలన్నా, రేషన్ ఇవ్వాలన్నా అంతా జగనన్న పాలనలో ఇంటికే వస్తుందని గుర్తుచేశారు. ప్రజలకు ఏం కావాలో సీఎం జగన్‌కు బాగా తెలుసని, అవ్వాతాతలు, బడుగు, బలహీన వర్గాలను క్షోభపెట్టడం చంద్రబాబుకు బాగా అలవాటన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు చరమగీతం పాడాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, లంకలపల్లి ప్రసాద్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రత్యేక డ్రైవ్



వాహనాలకు స్టిక్కర్లు తీయిస్తున్న ట్రాఫిక్ సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్: వాహనాల నంబర్ ప్లేట్‌బోర్డులపై ప్రెస్, పోలీస్, ఆర్మీ, రెవెన్యూ, సీఆర్పీఎఫ్ తదితర విభాగాల పేరిట స్టిక్కర్లు అంటించరాదని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం అన్నారు. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు నకిలీ వారిని గుర్తించే పనిలో సోమవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మోటారు వెహికల్ చట్టాననుసరించి వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌ప్లేట్ బోర్డు ఉండాలే తప్పా.. దానిపై ఎటువంటి డిజైన్ గాని, ఫొటోలు గానీ ఉండరాదన్నారు. సోమవారం ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొన్ని వాహనాల స్టిక్కర్లను తొలగించి జరిమానాలు విధించామన్నారు. కొంతమంది ఎక్సైజ్, సీఆర్పీఎఫ్, పోలీస్, ప్రెస్ వాళ్లు.. తమ సంబంధీకుల వాహనాలను ఆపి హెచ్చరించామన్నారు. నంబర్ ప్లేట్ బోర్డుపై స్టిక్కర్లు ఉంటే తొలగించుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



బెల్టులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా బోధిధర్మ యుద్ధ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లకు జిల్లా నలుమూలలు నుంచి 200 మంది హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా బెల్టులు ప్రదానం చేశారు. 65 మందికి వైట్ బెల్టులు, 80 మందికి ఎల్లో బెల్టులు, 50 మందికి ఆరెంజ్ బెల్టులు, 10 మందికి గ్రీన్ బెల్టులు అందజేశారు.

కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి, యుద్ధ కళ క్షేత్రం వ్యవస్థాపకులు రేగిడి దయమయ, విద్యార్థి భవన్ డైరెక్టర్ ఆరంగి గోవిందబాబు, ముఖ్య శిక్షకులు ఎం.వెంకటరావు, నక్క లక్ష్మణ్‌నాయుడు, బి.ఈశ్వర్, గౌతమి శివరాం, యస్వంత్, ఢిల్లీశ్వర్, రమణ, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగాలని ఎచ్చెర్ల తహసీల్దార్ వి.శ్యామ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికలు కంటే మంచి పోలింగ్ నమోదు కావాలన్నారు. గతంలో తక్కువగా పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల్లో ఈవీఎంపై అవగాహన కలిగించాలన్నారు. ఎలక్ట్రిక్ యంత్రాల వినియోగంపై ఓటర్లకు అవగాహనతోనే పోలింగ్ మెరుగుపడుతుందన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే మెరుగైన పోలింగ్ శాతం ఉండాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రోజు వరకు కొత్త ఓటర్ల నమోదు జరుగుతుందన్నారు. ప్రతి యువ ఓటర్ పోలింగ్‌లో పాల్గొనేలా వారికి అవగాహన అవసరమన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

హోంగార్డులకు సత్కారం



ఉమా, రాజులకు జ్ఞాపికలు అందజేసిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు వి.ఉమామహేశ్వర రావు, జి.రాజులను ఎస్పీ జి.ఆర్.రాధిక పూలమాలలతో సత్కరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తక్షణ ఆర్థిక సాయం కింద రూ.5 వేలు చెక్కులను, జ్ఞాపికలను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, హోంగార్డు ఆర్ఐ కె.వి.నర్సింగరావు, రమేష్ పాల్గొన్నారు.

ఉమారుద్రునికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని నాగావళి నదీ తీరాన ఉన్న ఉమారుద్రకోటేశ్వర స్వామికి సోమవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. మాఘమాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి



మాట్లాడుతున్న ఆర్వో లక్ష్మణమూర్తి

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు దృష్టి సారించాలని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి.లక్ష్మణమూర్తి, మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల, బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలను పరిశీలించాలన్నారు. ఎంపీడీఓ వెంకన్నబాబు, జోనల్ అధికారులు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, శారద, రామచంద్రరావు, కుప్పిలి రవికుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

పక్కాగా ఎడాక్స్ కోర్సుల అమలు



సమీక్ష నిర్వహిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్ : ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఎడాక్స్ కోర్సులు పక్కాగా అమలు కావాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో సోమవారం ప్రిన్సిపాళ్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్సిటీ పరిధిలో రెండు వేల మంది విద్యార్థులు ఇప్పటి వరకు ఈ మెయిల్ ఐడీ ద్వారా రిజిస్టర అయ్యారని, మిగిలిన వారు కూడా రిజిస్టర్ కావాలన్నారు. వర్సిటీ నుంచి సాంకేతిక బృందాలు ప్రతి పీజీ, డిగ్రీ కళాశాలను సందర్శించి యాజమాన్యాలకు, విద్యార్థులకు ఎడాక్స్ కోర్సులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కోర్సులతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్ రావు, ఎడాక్స్ అడ్మిన్ ఇన్‌చార్జి జి.రామకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



శ్రీకాకుళం రూరల్: ర్యాలీ చేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: ఓటు హక్కుపై పూడివలసలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వప్పంగి, శ్యామ్‌పాలెం గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలను సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం సుజాత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురికాకుడదన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ లక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి..

ఎచ్చెర్ల: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని వెలుగు ఏపీఎం రామ్మూర్తి తెలిపారు. చిన్నపూడివలస, అల్లినగరం, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో ఓటు హక్కుపై సోమవారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆర్వో ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్ సభ్యుల ఆత్మీయ కలయిక



ఒకేవేదికపై గ్రూపు సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పెద్దపాడు రోడ్డులో ఉన్న తోటలో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యుల ఆత్మీయ కలయిక జరిగింది. గౌరవ అతిథిగా పాల్గొన్న కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భాగ్యలక్ష్మి తోటల పెంపకం కోసం సూచనలు, సలహాలు ఇచ్చారు. సభ్యులందరూ తెచ్చిన మొక్కలు, విత్తనాలు, దుంపలు ఒకరికొకరు పంచుకున్నారు. గ్రూప్ సభ్యులందరికీ పిచ్చుకల కోసం, హరిత వికాస్ ఫౌండేషన్ వారు తెప్పించిన ధాన్యం కుంచెలు, నీళ్లు పెట్టడానికి మట్టి పాత్రలు అందచేశారు. సీజీటీ గ్రూప్ అడ్మిన్ అను పేర్ల, చిత్ర, న్యాయవాదులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, 82 మంది గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.